

రంజాన్ వేళలు

	ఇఫ్తార్(ఆదివారం)	సెహరీ(సోమవారం)
కర్నూలు	6:36 (సాయంత్రం)	4:51 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:33 (సాయంత్రం)	5:03 (ఉదయం)
ఆదోని	6:37 (సాయంత్రం)	4:51 (ఉదయం)

విజయ గళం



- పదునెక్కుతున్న వ్యూహాలు
- ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల కైవసం దిశగా టీడీపీ అడుగులు
- బీసీలకు ప్రాధాన్యం.. నాలుగు స్థానాలు వారికే
- నేడు ఎమ్మిగనూరుకు అధినేత చంద్రబాబు
- ప్రజాగళం రోడ్‌షో
- బాబు పర్యటనతో ఊపందుకోనున్న ప్రచారం

కర్నూలు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రజాగళం విజయగళమై కందనవోలు ముంగిట పసుపుజెండా రెపరెపలాడించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు వ్యూహాలకు పదును పెడుతున్నారు. బలహీన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ టీడీపీ-జనసేన-బీజేపీ ఎన్డీయే కూటమి నుంచి నాలుగు స్థానాల్లో బీసీలనే బరిలోకి దింపారు. ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీలు, 14 అసెంబ్లీ స్థానాల్లో విజయకేతనం ఎగరవేసే దిశగా టీడీపీని సిద్ధం చేస్తున్నారు. అభ్యర్థులకు సూచనలు ఇస్తూ.. కార్యకర్తలను కదనరంగంలోకి దించుతూ.. ఓటర్ల మనసు దోచే దిశగ చంద్రబాబు ప్రజాగళం పేరిట ఓటర్ల దగ్గరకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా నేడు ఎమ్మిగనూరులో చంద్రబాబు ప్రజాగళం రోడ్‌షో నిర్వహిస్తున్నారు.

టీడీపీ-జనసేనా-బీజేపీ ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఎమ్మిగనూరుకు రానున్నారు. ఉదయం 11:15 గంటలకు ఎల్లెల్సీ దగ్గర ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి అన్నమయ్య సర్కిల్, శివ సర్కిల్, సోమప్ప సర్కిల్, ట్యాంక్‌బండ్ రోడ్డు, శ్రీనివాస సర్కిల్, సోమేశ్వర సర్కిల్ మీదుగా తేరు బజారుకు చేరుకుంటారు. 11:30 నుంచి 12:30 గంటలకు బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. చంద్రబాబుకు ఘన స్వాగతం పలికేందుకు ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, కర్నూలు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజు ఏర్పాట్లు చేస్తున్నారు.

బీసీలకే ప్రాధాన్యం..

టీడీపీ బీసీల పార్టీ అని మరోసారి నిరూపించుకుంది. మంత్రాలయం నుంచి వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మాధవరం ఎస్.రాఘవేంద్రరెడ్డి, ఆలూరు నుంచి వీరశైవలింగాయత్ సామాజికవర్గానికి చెందిన బి. వీరభద్రగౌడు, పత్తికొండ నుంచి ఈడిగ సామాజిక వర్గానికి చెందిన కే.ఈ శ్యాంబాబు, బీజేపీ ఆదోని నుంచి తమ అభ్యర్థిగా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ పి.వి పార్థసారథిలను బరిలోకి దింపింది. అలాగే కర్నూలు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా బీసీలలో వెనుకబడిన కురువ సామాజిక వర్గానికి చెందిన బస్తిపాటి నాగరాజుకు టికెట్ ఇచ్చింది.

అసంతృప్తికి గురైన వారిని బుజ్జగిస్తూ..

మంత్రాలయం నియోజకవర్గం టికెట్‌ను టీడీపీ ఇన్‌చార్జి పి. తిక్కారెడ్డి ఆశించారు. అయితే సామాజిక సమీకరణాల దృష్ట్యా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మాధవరం రాఘవేంద్రరెడ్డికి టికెట్ ఇచ్చారు. ఆలూరు టికెట్ కోట్ల సుజాతమ్మ, వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం జ్యోతి ఆశించారు. అయితే వీరశైవ లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన వీరభద్రగౌడుకు టికెట్ ఇచ్చారు. ఆదోని నుంచి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె. మీనాక్షినాయుడు ఆశించారు. పొత్తులో భాగంగా ఆ స్థానాన్ని బీజేపీకి ఇవ్వాల్సి వచ్చింది. అసంతృప్తికి గురైన వారిని బుజ్జగిస్తూ టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఈ పర్యటనలో చంద్రబాబు వారితో మాట్లాడే అవకాశం ఉంది.

జిల్లా కోర్టులో వర్క్‌షాపు ప్రారంభం

- పలు సూచనలు చేసిన హైకోర్టు న్యాయమూర్తి



పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.సురేష్ రెడ్డి

కర్నూలు(లీగల్), మార్చి 30: ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయాధికారుల వర్క్‌షాపును రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే సురేష్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. సివిల్ దావాలపై అవగాహన కల్పించేందుకుగాను ఈ వర్క్‌షాపును ఏర్పాటు చేశారు. ఈ వర్క్‌షాపులో సివిల్ కేసుల దాఖలు, వాటి పరిశీలన, కేసుల పరిష్కారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి హైకోర్టు న్యాయమూర్తి ఇతర జిల్లా న్యాయాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జ్యుడిషియల్ అకాడమీ అదనపు డైరెక్టర్ జి. చక్రవర్తి, కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎస్. శ్రీనివాసరావు, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ. శ్రీనివాసకుమార్, అదనపు జిల్లా జడ్జిలు పీజే సుధ, పి. వాసు, పి. పాండురంగారెడ్డి, జి. రాంభూపాల్ రెడ్డి, బి. సునీత, ఎంపీ హరినాథ్, రిటైర్డు జిల్లా జడ్జి శివప్రసాద్‌లతోపాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని న్యాయాధికారులు పాల్గొన్నారు.

మాధవుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోడుమూరు(రూరల్), మార్చి 30: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవుడి రథోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ముస్తాబు చేసిన రథంపై కొలువుదీరిన మాధవస్వామి దేవేరులతో ఊరేగారు. అనంతరం రథాన్ని భక్తులు ఎదురుమండపం వరకు లాగి తిరిగి రథమండపం చేర్చారు. ఈ వేడుకను తిలకించేందుకు నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. తేరుబజారులో గోవిందనామస్మరణ మార్మోగింది. సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

పీవో, ఏపీవోల పాత్ర కీలకం

- ఈవీఎం కనెక్షన్లపై అవగాహన అవసరం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన



పీవో, ఏపీవోలకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 30: రానున్న ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోల పాత్ర కీలకమని, గతంలో అనేకసార్లు ఎన్నికల విధులు నిర్వహించామనే నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించవద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన అన్నారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీ కన్వెన్షన్ సెంటరులో సాధారణ ఎన్నికల-2024 నిర్వహణపై మొదటి సెషన్‌లో మంత్రాలయం, ఆలూరు, రెండో సెషన్‌లో ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల పీవోలు, ఏపీవోలకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి నుంచి పోలింగ్ స్టేషన్‌లో ఉండే పీవో, ఏపీవో, ఓపీవోల వరకు రాజ్యాంగబద్ధ బాధ్యతను నిర్వహిస్తున్నామనే అవగాహన ఉండాలని అన్నారు. ఈవీఎం కనెక్షన్లతోపాటు కొత్తగా వచ్చిన నియమాలపై అవగాహన మరింత పెంచుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలతో కలిసి 2208 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, ఈవీఎం డెమోన్‌స్ట్రేషన్ పీవో డైరీ మీద, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి మాక్‌పోల్, ఈవీఎం డెమోన్‌స్ట్రేషన్ మీద ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి, డాక్యుమెంటేషన్ (ఫైలింగ్ ఆఫ్ పీవో రిపోర్టు, ఫైలింగ్ ఆఫ్ పీవో డైరీ) కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, మంత్రాలయం ఆర్వో డాక్యుమెంటేషన్ మీద పీవో, ఏపీవోలకు శిక్షణ ఇచ్చారు.



పాల్గొన్న పీవో, ఏపీవోలు

ఓటుతోనే భవిష్యత్

- ఓటు వేయడం అందరి బాధ్యత
- అభివృద్ధి బాటలో నడిపించే నేతలను ఎన్నుకోవాలి



కర్నూలు(కలెక్టరేట్), మార్చి 30: మన దేశంలో ప్రజాస్వామ్యం ఉందనడానికి గుర్తు ప్రతి ఐదు సంవత్సరాలకు ఎన్నికలు జరగడం. లోక్‌సభకు ఎంపీలను, అసెంబ్లీకి ఎమ్మెల్యేలను ప్రజలు తమ ఓటు ద్వారా ఎన్నుకుంటున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అభ్యర్థికి ఓటు హక్కును రాజ్యాంగం కల్పించింది. పార్లమెంటు, అసెంబ్లీలో బిల్లులు చట్టాలుగా కార్యరూపం దాల్చడానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఖచ్చితంగా ఆమోదం తెలపాలి. ప్రతి ఓటరు ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే అభ్యర్థిని గుర్తించి ఓటు వేసి గెలిపించాలి. ఓటు ఉన్న ప్రతి పౌరులు తమ ఓటు వేయడానికి దగ్గరలో పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకోవాలి. శనివారం నగరంలోని ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాల్లో జిల్లా స్థాయిలో పీవో, ఏపీవోలకు శిక్షణా తరగతులు అధికారులు నిర్వహించారు. మంత్రాలయం 646, ఆలూరు 765, ఎమ్మిగనూరు 680, పత్తికొండ 676, అలాగే ఏప్రిల్ 1న కోడుమూరు 827, ఆదోని 454, కర్నూలు 898, పాణ్యం 411 నియోజకవర్గాలకు సంబంధించిన పీవో, ఏపీవోలకు శిక్షణ ఇవ్వనున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఏప్రిల్ 10లోపు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

ఎన్నికల్లో ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం బాధ్యతగా పౌరులు భావించాలి. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు. దాన్ని వినియోగించుకోవడం బాధ్యత. అయితే ఎన్నికల ప్రక్రియ గురించి ఓటర్లకు అవగాహన ఉండాలి. అప్పుడే తమ ఓటును సరిగా వినియోగించుకోగలుగుతారు. పోలింగ్ ప్రక్రియలో వివిధ స్థాయిల్లో అధికారులు పాల్గొంటారు. ఎలా అంటే...



పోలింగ్ కేంద్రంలో..

ప్రిసైడింగ్ అధికారి (పీవో), సహాయక ప్రిసైడింగ్ అధికారి (ఏపీవో), ఓపీవోలు-4, పోలింగ్ ఏజెంట్లు, పోలింగ్ సిబ్బంది ఉంటారు.

అధికార విధులు

ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారి (పీవో) పర్యవేక్షణ అధికా రిగా ఉంటారు. పీవో ఆధ్వర్యంలో ఏపీవో, ఓపీవోలు పని చేస్తారు. సహా యక ప్రిసైడింగ్ అధికారి ఓటరు లిస్టు, ఓటర్ల గుర్తింపు కార్డుల ను పరిశీలిస్తారు. రెండో పోలింగ్ ఆఫీసర్ ఇండెలిబుల్ ఇంక్ ఇన్ చార్జి, ఓట్ల రిజిస్టర్ ఇన్‌చార్జి, 17ఏలో ఓటరు వేలిముద్ర లేదా సంతకం తీసుకుంటా రు. మూడో పోలింగ్ ఆఫీసర్ ఓటర్ల స్లిప్ ఇన్‌చార్జి తెలుపు, పింక్ ఓటరు స్లిప్పులు ఇస్తారు. ఇండెలిబుల్ ఇంక్ మార్క్ తనిఖీ చేసా రు. నాలుగో పోలింగ్ ఆఫీసర్ లోక్‌సభ కంట్రోల్ యూనిట్ ఇన్‌చార్జి తెలు పు స్లిప్పు తీసుకుని బ్యాలెట్ రిలీజ్ చేస్తారు. ఐదో పోలింగ్ ఆఫీసర్ అసెం బ్లీ కం ట్రోల్ యూనిట్ ఇన్‌చార్జి, పింక్ స్లిప్పు తీసుకుని బ్యాలెట్ రిలీజ్ చేస్తారు.

ఓటరు గుర్తింపు కార్డు లేకుంటే

ఓటు వేసే సమయంలో ఓటరు గుర్తింపు కార్డును చూపించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. లేదంటే 12 రకాల ప్రత్యామ్నాయ కార్డులను సూచించింది.

1) ఆధార్‌కార్డు, 2) ఉపాధి హామీ జాబ్ కార్డు, 3) బ్యాంకులు, పోస్టాఫీసులు జారీ చేసే పాస్‌బుక్, 4) హెల్త్ ఇన్సూరెన్స్ హెల్త్ కార్డు, 5) డ్రైవింగ్ లైసెన్స్, 6) పాన్ కార్డు, 7) నేషనల్ పాపులేషన్ రిజిస్ట్రార్ జారీ చేసే స్మార్ట్ కార్డు, 8) పాస్‌పోర్టు, 9) పెన్షన్ డాక్యుమెంటు, 10) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసే గుర్తింపు కార్డులు, 11) ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసే గుర్తింపు కార్డులు, 12) యూనిక్ డిసెబిలిటీ ఐడీ కార్డులు.

మాక్ పోల్ నిర్వహణ

పోలింగ్ కేంద్రంలో పీవో పోలింగ్ కేంద్రం కాకముందే పోలింగ్ ఏజెంట్ల ఆధ్వర్యంలో మాక్ పోల్ నిర్వహిస్తారు. దాదాపు మాక్‌పోల్ ద్వారా 50 ఓట్లు నమోదు చేస్తారు.

టెండర్ బ్యాలెట్

ఓటర్ పోలింగ్ స్టేషన్‌కు వచ్చి తన ఓటు అప్పటికే పోల్ అయినట్లు గుర్తిస్తే.. ఓటర్ అండర్ రూల్ 49పీ ప్రకారం టెండర్ బ్యాలెట్ కోసం అడగవచ్చు. పీవో ఓటరుపై నిజనిర్ధారణ చేసిన తర్వాత టెండరు బ్యాలెట్ పేపర్ ఇస్తారు. ఈవీఎం ద్వారా ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు వేయడానికి ఆస్కారం ఉండదు.



చాలెంజ్ ఓటు

ఓటు వేయడానికి వచ్చిన ఏ వ్యక్తి అయినా ఓటరు కాదని భావిస్తే పోలింగ్ ఏజెంటు చాలెంజ్ చేయవచ్చు. అందుకు పోలింగ్ ఏజెంట్ ఛాలెంజ్ రుసుము రూ.2 ప్రిసైడింగ్ అధికారికి చెల్లించాలి. అధికారులు సంబంధిత ఓటరుపై నిజనిర్ధారణ చేసిన తర్వాత ఓటు వేయడానికి అనుమతిస్తారు. లేకపోతే ఆ ఓటరును పోలీసులకు అప్పగిస్తారు. ఏజెంటు చాలెంజ్ రుజువైతే తిరిగి రూ.2 ఇస్తారు.

టెస్టు ఓటు

వీవీ ప్యాట్‌లో ఓటరు తన ఓటు వేసిన తర్వాత ప్రింటర్‌లో నుండి వెలువడిన పేపర్‌స్లిప్‌లో అభ్యర్థి పేరు గుర్తు తాను వేసిన వ్యక్తికి పడలేదని అనుకున్నట్లయితే.. రూల్ 49 ఎంఎ కింద ఓటరు టెస్టు ఓటును అడగవచ్చు..

పోలింగ్ ఏజెంట్లు

పోలింగ్ కేంద్రంలో వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లు ఎన్నికల ఏజెంట్ ద్వారా నియమితులవుతారు. అందుకు పోలింగ్ ఏజెంట్లు ఫారం-10కు దరఖాస్తు చేసుకోవాలి. అసెంబ్లీ నియోజకవర్గంలో నివసించే స్థానిక వ్యక్తిగా లేదా సంబంధిత పోలింగ్ స్టేషన్‌లో లేదా పొరుగున ఉన్న పోలింగ్ స్టేషన్ ప్రాంతాలలో నివాసి అయి ఉండాలి.

21న ఆదర్శ పాఠశాలలకు ప్రవేశ పరీక్ష

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 30: 2024-25 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21వ తేదీన ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామేల్ శనివారం తెలిపారు. ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని అన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో తెలుగు, లేదా ఇంగ్లీషు మీడియాల్లో ఉంటుందని అన్నారు. ఆదర్శ పాఠశాలలు సీబీఎస్ఈకి అనుబంధంగా ఉన్నాయన్నారు. ఆంగ్ల మాధ్యమంలోనే బోధన జరుగుతుందన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 30: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులో ప్రవేశానికి ఏప్రిల్ 27న జరిగే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎంవీఎస్ఎన్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 24వ తేదీ వరకు తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణతో పాటు మెటీరియల్ కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9492403015 నెంబరును సంప్రదించాలన్నారు.

- **ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలలో:** ఏప్రిల్ 1 నుంచి 25వ తేదీ వరకు పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి శనివారం తెలిపారు. ఉచిత శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ ఇస్తున్నట్లు తెలిపారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు

మంత్రాలయం, మార్చి 30: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయం వచ్చిన ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ రవీంద్రబాబుకు శనివారం మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట ఎస్ఐ గోపినాథ్, ఏఎస్ఐ నాగరాజు, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది జలశక్తిపై అధ్యయనం

- ఇక్కడి జలసంపద గురించి దేశానికంతా తెలియజేస్తాం
- ఇంటాచ్ నిపుణుడు సుమేష్ దుదాని



మహానందిలో సుమేష్ దుదాని బృందం

మహానంది, మార్చి 30 : మహానంది క్షేత్రంలోని జల శక్తిపై ఢిల్లీకి చెందిన ఇంటాచ్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్స్ కల్చర్ అండ్ హెరిటేజ్) అధ్యయనం చేస్తున్నట్లు మిషన్ ఆన్ వాటర్ నిపుణుడు సుమేష్ దుదాని తెలిపారు. శనివారం మహానందిలోని అద్భుత జలసంపదను అధ్యయనం చేయడానికి ఆయన తన బృందంతో కలసి వచ్చారు. ఇందులో భాగంగా ఇక్కడి నీటి వనరులను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ఈనెల 27న ధవళేశ్వరం బ్యారేజీ, 29న పోరుమామిళ్లతో పాటు కంభం ట్యాంక్‌లను, చెరువులను పరిశీలించినట్లు చెప్పారు. మహానందిలోని జలసంపదను కూడ నంద్యాల చాప్టర్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డితో కలసి అధ్యయనం చేశామన్నారు. మహానంది క్షేత్రంలోనే ఉన్న ఈ తరహా జలసంపద ప్రత్యేకతలను పరిశోధన చేసి దేశానికి తెలియజేస్తామని అన్నారు. ఈ విషయంపై ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డితో కలసి చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు, గొల్ల సుదర్శనం, మారం శేషయ్య, డాక్టర్ కిషోర్, రోటరీ సుబ్బయ్య యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- తల్లిదండ్రులకు, తమ్మునికి గాయాలు

ఓర్వకల్లు, మార్చి 30: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40 పై హుశేనాపురం బస్టాండు సమీపాన గల పెట్రోల్ బంకు వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పవన్ (3) అనే బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఓర్వకల్లు మండలం కన్నమడకల గ్రామానికి చెందిన వడ్డె పరశురాం తన భార్య జ్యోతి, ఇద్దరు కుమారులతో ద్విచక్రవాహనంపై నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలోని బంధువుల ఇంటికెళ్లి తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నంద్యాల నుంచి కర్నూలు వెళ్తూ ముందువైపు వెళ్తున్న పరశురాం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో పెద్ద కుమారుడు పవన్ (3) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పరశురాం, జ్యోతి, చిన్న కుమారుడు గాయపడ్డారు. ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయింది. కళ్లెదుటే కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

చెరువులో పడి భక్తుడు..

మంత్రాలయం, మార్చి 30: పాదయాత్రగా శ్రీశైలం బయల్దేరిన భక్తుడు మృతి చెందాడు. కర్ణాటకలోని బెలగావి జిల్లా మాండలిగి తాలుకా ఉంచాల గ్రామానికి హనుమంతు (22) శ్రీశైలం వెళ్తూ శనివారం మండలంలోని చిలకలడోన గ్రామ సమీపంలో చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఈత రాక మృతి చెందాడు. తోటి భక్తులు యువకున్ని కాపాడే ప్రయత్నం చేసినా ఫలించలేదు. అప్పటికే మృతి చెందడంతో మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీశారు. ఎస్ఐ గోపినాథ్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతదేహాన్ని అంత్యక్రియల కోసం స్వ గ్రామానికి తరలించారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లో కన్నమడకల వాసి..

ఓర్వకల్లు, మార్చి 30: మండలంలోని కన్నమడకల గ్రామానికి చెందిన పెద్ద వెంకటస్వామి (60) ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో రైలు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పెద్ద వెంకటస్వామికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే వారు పట్టించుకోకపోవడంతో ఇతర రాష్ట్రాల్లో బిక్షాటన చేస్తూ కడుపు నింపుకునేవాడు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో రైలు నుంచి కింద పడి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని వద్ద ఆధార్‌కార్డు ఉండటంతో ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు గుర్తించి ఓర్వకల్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.

ఈతకు వెళ్లి యువకుడు..

సి. బెళగల్, మార్చి 30: మండలంలోని ఈర్లదిన్నె గ్రామానికి చెందిన సులోచనమ్మ, రాజు దంపతుల మూడో సంతానం దైవాదీనం (19) శనివారం తమ పొలంలో ఉన్న బావిలో ఈతకువెళ్లినప్పుడు ఫిట్స్ రావడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ 10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కోడుమూరు నియోజ కవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, టీడీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శేషన్న, సోమన్న, భాస్కర్ తదితరులు ఉన్నారు.

రూ.2.50 లక్షలు పట్టివేత

చాగలమర్రి, మార్చి 30: చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో ఇద్దరు వ్యక్తుల నుంచి ఎలాంటి ఆధారాలు లేని రూ.2.50 లక్షలు నగదు పట్టుబడినట్లు ఆళ్లగడ్డ రూర ల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ రమణయ్య తెలిపారు. శనివారం తెల్లవారుజామున చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా కడప జిల్లా దువ్వూరు మండలం చింతకుంట సుబ్బరాయుడు అనే వ్యక్తి ఆటోలో రూ.1.55 లక్షలు తీసుకెళ్తుండగా సీజ్ చేశామని అన్నారు. బ్రాహ్మణప ల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో రూ.95వేలు నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని అన్నారు.

పొలం రస్తా విషయంలో ఘర్షణ

రుద్రవరం, మార్చి 30 : మండలంలోని బీరవోలు గ్రామ రెవెన్యూ పరిధిలో పొలం రస్తా విషయంలో శుక్రవారం రాత్రి వాగు వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందని శనివారం ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. కుడాల వెంకటపతి ఆలియాస్ మార్క్ వీఆర్ఏ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంగరాజ్‌కుమార్, డేవిడ్, ఆల్‌ఫ్రెడ్, చక్రపాణి, యోహాన్, చిన్న లింగమయ్య, విజయకుమార్, మనోహర్‌లపై, అంగరాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు బీరవోలు గ్రామానికి చెందిన కుడాల వెంకటపతి వీఆర్ఏ, యోహాను, మనోజ్, రాజశేఖర్ మొత్తం 13 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేలిన ఆటో టైర్

ఆటో అదుపు తప్పి బోల్తా..

30 మంది కూలీలకు గాయాలు



చెల్లాచెదరుగా పడిన క్షతగాత్రులు

ఆలూరు, మార్చి 30 : ఆలూరు మండలం హత్తిబెళగల్ సమీపంలో శనివారం టైర్ పేలడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడిం ది ఈ ప్రమాదంలో 30 మంది కూలీలు తీవ్ర గాయాలపా లయ్యారు. వారిని అంబులెన్స్ ద్వారా ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆలూరు మండలంలోని హులేబీడు గ్రామానికి చెందిన కూలీలు చిప్పగిరిలో మిరపకాయలు తెంపేందుకు ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దస్తగిరమ్మ, శేకమ్మ, బీమలింగ మ్మ తీవ్రంగా గాయడటంతో వారిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తా పడిన ఆటో

కారు - ఆటో ఢీ


- ఇద్దరికి తీవ్ర గాయాలు
- మరో 8 మందికి స్వల్ప గాయాలు

ఉయ్యాలవాడ, మార్చి 30: మండలంలోని ఆర్. పాంపల్లె గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కారు, ఆటో ఢీ కొన్నాయి. కొలిమిగుండ్ల మండలానికి చెందిన కారు అహోబిలం నుండి కొలిమిగుండ్లకు వెళుతుండగా.. రుద్రవరం మండలం టి. లింగందిన్నె గ్రామానికి చెందిన ఆటో మహిళ కూలీలతో పొలం పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలు ఉన్న ఇద్దరు మహిళ కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో 8 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రైల్వే ఉద్యోగి అదృశ్యం.. కేసు నమోదు

మంత్రాలయం, మార్చి 30: మంత్రాలయం మండలంలోని కాచాపురం గ్రామానికి చెందిన సూరిపోగు నాగరాజు (36) అనే రైల్వే ఉద్యోగి అదృశ్యమయ్యాడు. నాగరాజు కాచాపురంలో ఉంటూ ఆదోని రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌మెన్‌గా ఉద్యోగం చేస్తుండేవాడు. ఈ నెల 2వ తేదీన విధుల్లో భాగంగా ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి వెళ్లి ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి 28 రోజులు కావస్తున్నా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆయన భార్య ఎలిజబెత్ శనివారం మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. తెలిపారు.

పత్తికొండ వైసీపీలో ఏకాభిప్రాయం కుదిరేనా..?



ముఖ్యమంత్రిని కలిసేందుకు వెళుతున్న ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ, మార్చి 30 : పత్తికొండ వైసీపీలో ఏకాభిప్రాయం కుదిరేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి జగన్ పత్తికొండలో బస చేశారు. అసమ్మతి నేతలు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మలను పిలిపించి మాట్లాడినట్లు సమాచారం. వీరంతా ఎమ్మెల్యే శ్రీదేవితో కలిసి పనిచేసి పార్టీ గెలుపునకు పని చేస్తారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది.

స్కూల్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 30: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని టెంపుల్ స్ట్రీట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు)గా పని చేస్తున్న జి. సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ శనివారం తెలిపారు. కర్నూలులోని ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాలులో జరిగే శిక్షణ కార్యక్రమానికి ఉపాధ్యాయుడు జి. సత్యనారాయణ ఆలస్యంగా హాజరు కావడంతో కలెక్టర్ ఆగ్రహించి, టీచర్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు జి. సత్యనారాయణను సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు.

ఇసుక దందాతోనే నగరానికి నీటి సమస్య

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి



కర్నూలు(అర్బన్), మార్చి 30: వైసీపీ నాయకుల ఇసుక దందాతోనే కర్నూలు నగరానికి నీటి సమస్య తలెత్తిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతగాని తనం వల్లే కర్నూలు చుట్టుపక్కల నీరు ఉన్నప్పటికీ నగరానికి కనీసం తాగునీరు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. గతంలో చంద్రబాబు జిల్లాలో రైతాంగం, ప్రజల కష్టలను దృష్టిలో ఉంచుకొని గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డీ ఎస్ వంటి ప్రాజెక్టులను మొదలు పెట్టగానే జగన్ వచ్చిన తర్వాత రీ టెండర్స్ పేరుతో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను రద్దు చేశారన్నారు. దీనికి తోడు తుంగభద్రలో అడ్డు, అదుపు లేకుండా ఇసుక తోడేసి భారీగా గుంతలు పడగా సుంకేసుల బ్యారేజీకి వచ్చే నీరు ఆ గుంతల్లోకి చేరినందున బ్యారేజీకి నీరు చేరకుండా పోయిందన్నారు. వైసీపీ ఎమ్మెల్యే ప్రజాసమస్యలను పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

రన్ ఫర్ జీసస్ విజయవంతం



జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న క్రైస్తవులు

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 30: ఈఎస్‌టీ ఆధ్వర్యంలో సిటీ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ర్యాలీ విజయవంతమైంది. స్థానిక రాక్‌వుడ్ చర్చిలో రన్ ఫర్ జీసస్ ర్యాలీని కమిటీ చైర్మన్ రెవ. డాక్టర్ ఆర్‌ఆర్‌డీ సజీవరాజు జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఏసు మరణం, పునరుత్థానంతో లోకానికి చాటు చెప్పిన ప్రేమ, త్యాగం ప్రచారం చేయడమే రన్ ఫర్ జీసస్ ముఖ్య ఉద్దేశమన్నారు. కన్వీనర్ దాసరి సుధీర్ మాట్లా డుతూ కర్నూలు పట్టణ క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరై రన్ ఫర్ జీసస్ ను విజయవంతం చేశారన్నారు. ఈ రన్ రాక్‌వుడ్ చర్చి నుంచి ప్రారంభమై మౌర్యఇన్, రాజ్‌విహార్, కలెక్టరేట్ మీదుగా ప్రార్థనా మందిరం చర్చి సీ.క్యాంపులో ముగిసిందన్నారు. స్టాంటన్ మెమోరియల్ చర్చి కోరియోగ్రఫీ క్రైస్తవులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీఈ రంగస్వామి, సిటీ పాస్టర్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.దాసు, హోసన్న మందిర్ సంఘం కాపరి ఫ్రైడీ పాల్, రాక్‌వుడ్ సంఘం అధ్యక్షుడు ఆనందరావు, కోల్స్ చర్చి అధ్యక్షుడు లింకన్, ప్రార్థన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, సునీల్, కోల్స్ చర్చి సంఘం కాపరులు ఎస్‌జే జీవన్, ఆర్.అనిల్ కుమార్ శామ్యూల్, కల్వరి టెంపుల్ సంఘం కాపరులు వేణు, బాలరాజు, రన్‌ఫర్‌జీసస్ కార్యదర్శి జయాకర్, ట్రెజరర్ సురేష్ పాల్గొన్నారు.

ఓటు హక్కు మనందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న పొదుపు మహిళలు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 30: ఓటు హక్కు మనందరి బాధ్యత అని స్వీప్ జిల్లా అధికారి, సెట్కూరు సీఈఓ రమణ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం కేవీఆర్ డిగ్రీ కళాశాల నుంచి నరసింహారెడ్డి నగర్, బంగారుపేట వరకు ఓటు హక్కు వినియోగంపై కళాజాత బృందాలతో అవగా హన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పొదుపు మహిళలు పాల్గొన్నారు.

క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా ఉండవల్లి వెంకటన్న



వెంకటన్నకు నియామక పత్రాన్ని అందజేస్తున్న బాబురావు

కర్నూలు(అర్బన్), మార్చి 30: కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా ఉండవల్లి వెంకటన్నను నియమించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో డీసీసీ అధ్యక్షుడు కే.బాబురావు నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి దామోదరం రాధాకృష్ణ, ప్రణాళిక కమిటీ చైర్మన్ విశ్రాంత ఉన్నతాధికారి ఎస్.రామస్వామి, డీసీసీ ప్రధాన కార్యదర్శి షేక్ నవీద్, కె.సత్యనారాయణ గుప్త, ఎస్.ప్రమీల, వెంకట రాముడు పాల్గొన్నారు.

7న వ్యాస రచన పోటీలు

కర్నూలు(కల్చరల్), మార్చి 30: లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న జాతీయ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్ - పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై ఈ పోటీలు హిందుస్థాన్ ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్, వాచ్ ఇండియా ఫౌండేషన్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పోటీలకు 12 నుంచి 18 సంవత్సరాల లోపు విద్యార్థులు అర్హులని, విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు ఏప్రిల్ 4లోగా వెంకటరమణ కాలనీలో మెదటి లైన్‌లోగల నైస్ కంప్యూ టర్స్ శిక్షణ కేంద్రం కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

ఓర్వకల్లు, మార్చి 30: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఓర్వకల్లులో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సూపర్‌సిక్స్ పథకాలను ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లాబాబు, అబ్దుల్లా, వేణుగోపాల్ రెడ్డి, బత్తుల వెంకటరమణ, ఆదాం బాషా పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ముస్లింల అభివృద్ధి

కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 30: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని పార్టీ కర్నూలు అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని గడ్డ వీధిలో టీడీపీ నాయకులు జవాద్, సిరాజ్ బృందం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లింలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముస్లింల ఉపవాస దీక్షలను ఆయన విరమింపజేశారు. గతంలో చంద్రబాబు ముస్లింల అభివృద్ధి కోసం ఎంతో చేశారన్నారు. దుల్హన్ పథకం ద్వారా మైనార్టీ యువతుల వివాహానికి చంద్రబాబు నాయుడు సీఎం గా ఉన్నప్పుడు రూ. 50 వేలు అందించినట్లు గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం వస్తే రూ.లక్ష ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక నిబంధనలు పెట్టి అందకుండా చేశారని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసమూర్తి, సీనియర్ నాయ కులు మన్సూర్ అలీఖాన్, హమీద్, వార్డు ఇన్‌చార్జి ఇబ్రహీం పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: టీడీపీ అధికారంలోకి వచ్చాక కర్నూలులో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తానని కర్నూలు పార్టీ



క్రీడా సంఘాల ప్రతినిధులతో టీజీ భరత్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీజీ భరత్

అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని ఆరోరా నగర్‌లో టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు చాలా మందికి అందలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక అర్హులకు తప్పకుండా న్యాయం చేస్తామన్నారు. నగరంలోని విద్యుత్, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి శ్రీధర్, బాలు, జనసేన నాయ కులు పవన్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం: క్రీడలకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తామని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం స్థానిక మౌర్యఇన్‌లోని ఆయన కార్యాలయంలో కర్నూలు జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. తన తండ్రి టీజీ వెంకటేశ్ రాజకీయాల్లోకి రాక ముందు నుంచే క్రీడలకు సహకారాలు అందిస్తూ వచ్చారన్నారు. రాజకీయ రంగ ప్రవేశం చేసిన తర్వాత టీజీవీ సంస్థలతోపాటు ప్రభుత్వపరంగా క్రీడా రంగం అభివృద్ధి, క్రీడాకారులకు చేయూతనిచ్చేందుకు పెద్దపీట వేశారని తెలిపారు. అర్చరి, హ్యాండ్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్, రగ్బీ, పవర్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, హాకీ, ఫుట్‌బాల్, ఒలింపిక్ అసోసియేషన్, అథ్లెటిక్స్, తైక్వాండో, టేబుల్ టెన్నిస్, తదితర అసోసియేసన్ ప్రతినిధులు హాజరై టీజీ భరత్‌కు మద్దతు తెలిపారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడుదాం

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత

కల్లూరు, మార్చి 30: వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, ఆ పార్టీకి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 19వ వార్డు ఇంజనీర్స్ కాలనీలో ఆమె శంఖారావం, సూపర్‌సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్ర బాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే కోసమే చంద్రబాబు టీడీపీ కూటమి ఏర్పాటు చేశారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్య కర్తలు సమష్టిగా పనిచేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పెరుగు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గౌరు జనార్దన్‌రెడ్డి, కె.పార్వతమ్మ



ఇంజనీర్స్ కాలనీలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరు చరిత

పురు షోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పెద్దటేకుపల్లి, పల్లె రఘునాథ్‌రెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డి, మాండ్ర నరేంద్రనాథ్‌రెడ్డి, వంగాల జనార్దన్‌రెడ్డి, జనసేన నాయకుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

- కల్లూరు అర్బన్ 41వ వార్డు మేదర్ కాలనీ, ఎన్టీఆర్ నగర్‌లో పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. శనివారం నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ఆయన టీడీపీ మేనిఫేస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి జనార్దన్ ఆచారి, శ్రీరాములు, పీజీ వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



టీజీ వెంకటేశ్‌ను సత్కరిస్తున్న జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు

కర్నూలు(కల్చరల్), మార్చి 30: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలో కర్నూలు జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీ వెంకటేశ్‌ను యువజన సంఘం నాయకులు ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపార రంగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదని అన్నారు. ప్రస్తుతం వ్యాపార రంగ పరిస్థితి బాగా లేనప్పటికీ తాము ఏ రంగాల్లో అయితే రాణించగలమో గుర్తించి అందులో పెట్టుబడులు పెడితే భవిష్యత్తులో వృద్ధిలోకి రావడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఆర్యవైశ్యుల కోసం కృషి చేసే వారిని ఏ పార్టీలో ఉన్నా వారి అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు దేవకి జనార్దన్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్ర మంలో ఆర్యవైశ్యులు జయంతి వెంకటేశ్వర్లు, విట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యా భవన్‌కు భూమి పూజ



భూమి పూజకు హాజరైన విద్యాధీశ తీర్థ స్వామీజీ, విద్యా రాజేశ్వర తీర్థ స్వామీజీ

కర్నూలు(కల్చరల్), మార్చి 30: స్థానిక వెంకటరమణ కాలనీలో కొత్తగా నిర్మించనున్న వేద విద్యాభవన్‌కు ఉడిపి పలిమారు పీఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామీజీ, ఉత్తరాధికారి విద్యా రాజేశ్వర తీర్థ స్వామీజీలు శనివారం భూమి పూజ చేశారు. వీఆర్ కాలనీలో 11 సెంట్ల స్థలాన్ని మేడూరి వారి తెలుగు సాహితీ సమితి సంస్థ వారు అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేద విద్యాలయానికి విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యాధీశ తీర్థ స్వామీజీ మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం శాశ్వతంగా నిలిచి ఉంటుందన్నారు. వేద పారాయణం జరిగే గ్రామాల్లో, పట్టణాల్లో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని అన్నారు. సాహితీ సమితి సంస్థ అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ స్థలం సేకరించిన దివంగత మేడూరి దీక్షితుల వెంకట సుబ్బయ్య, ఉప్పలూరి మల్లికార్జున శాస్త్రి, పండుగ సుబ్బారెడ్డిల సంకల్పం నేడు కార్యరూపం దాల్చు తున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. కరివేన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ స్థల దాతల ఆశయం కచ్చితంగా నెరవేరుస్తామని అన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు జేఎస్ ఆర్‌కే శర్మ, వేద పాఠశాల కరస్పాండెంట్, కరివేన సత్రం సభ్యులు హెచ్‌కే మనోహర్‌రావు, హరిహరనాథ శర్మ, వర్కింగ్ కమిటీ సభ్యుడు హెచ్‌కే రాజశేఖర్‌రావు, సాహితీవేత్తలు, విద్యావేత్తలు పాల్గొన్నారు. అంతకు ముందు పీఠాధిపతి, ఉత్తరాధికారి సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో పూజలు నిర్వహించారు.

జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 30: పీసీపీఎన్‌డీటీ జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం శనివారం ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం డీఎంహెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో ఆన్‌లైన్‌లో అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులను కమిటీ ఆమోదం కోసం ప్రవేశ పెట్టారు. వీటిని జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సభ్యులు పరిశీలించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి మల్టి నెంబరు అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఆమోదం కోసం పంపినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. ఇందులో కొత్తగా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ కోసం 8 స్కానింగ్ కేంద్రాలు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. కొన్ని స్కానింగ్ కేంద్రాల్లో ఫారం-ఎఫ్ గర్భిణుల వివరాలను సరిగ్గా పంపడం లేదని, కొందరు వైద్యులు అభ్యంతరం తెలిపారు. ఈసమావేశంలో కర్నూలు జీజీహెచ్ రేడియాలజి, పీడీయాట్రిక్, గైనకాలజీ విభాగాల హెచ్‌వోడీలు రాధారాణి, విజయానందబాబు, శ్రీలక్ష్మి, గైనిక్ అసిస్టెట్ ప్రొఫెసర్ నర్మద, డీఎస్‌వో నాగప్ర సాద్, డెమో ప్రమీలాదేవి, ఎన్‌జీవో కొమ్ముపాలెం శ్రీనివాసులు, ఎం.నాగరాజు, పీసీపీఎన్‌డీటీ కన్సల్టెంటు సుమలత, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెచ్‌ఈ పద్మావతి పాల్గొన్నారు.

నేడు 'గామాగో' ఆత్మకథ పుస్తకావిష్కరణ

కర్నూలు(కల్చరల్), మార్చి 30: స్వాతంత్ర్య సమరయోధుడు గామాగో (భీమునిపాటి వెంకట సుబ్బారెడ్డి) ఆత్మకథ పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభను అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. నగర ప్రముఖులు కే రామాంజినేయులు (సీపీఐ), పత్తి ఓబులయ్య (టీజీవీ కళాక్షేత్రం), కేసీ కల్కూర, రాయపాటి శ్రీనివాస్, పాణ్యం నాగార్జున, గడ్డం అమర్‌నాథ్‌రెడ్డి, జంధ్యాల రఘుబాబు, కలం ప్రహ్లాద చేతుల మీదుగా ఈ పుస్తకావిష్కరణ ఉంటుందని తెలిపారు. జేఎస్‌ఆర్‌కే శర్మ, ఉమామహేష్ పుస్తకాన్ని సమీక్షిస్తారని తెలిపారు. గామాగోతో అనుబంధాన్ని ఆయనతో సన్నిహితంగా మెలిగిన శ్రీనివాసరావు, భార్గవ, ఎస్‌డీవీ అజీజ్‌లు వివరిస్తారని తెలిపారు. గామాగో కుమార్తె ముక్కమల్ల ధరిత్రీ దేవిని సత్కారిస్తామని హరికిషన్ తెలిపారు.

ఘనంగా ఖాజా హుశేన్‌స్వామి కిస్తీలు



కిస్తీలో పాల్గొన్న భక్తులు

కోడుమూరు(రూరల్), మార్చి 30: మండలంలోని వర్కూరులో సద్గురు ఖాజాహుశేన్‌దాస్‌స్వామి కిస్తీలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గ్రామవీధుల్లో భక్తులు ప్రసాదాలను మేళ తాళాల మధ్య స్వామివారి దర్గాకు చేర్చారు. అక్కడ దర్గా ముందున్న రాతి పాత్రలో ప్రసాదాలను ఉంచి పూజలు చేశారు. అనంతరం భక్తులు ప్రసాదాన్ని స్వీకరించడానికి పోటీ పడ్డారు. భక్తులు దర్గాలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి ఖాజా సుభాహాన్‌దాస్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో చిన్నసుభాహాన్‌స్వామి, టీచర్ తాజుద్దీన్, పెద్ద ఫక్రుద్దీన్, చిన్న ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

బైపోలార్ ఒక మానసిక రుగ్మత

కర్నూలు(హాస్పిటల్), మార్చి 30: బైపోలార్ వ్యాధి ఒక మానసిక రుగ్మత అని మానసిక వ్యాధుల నిపుణుడు డాక్టర్ బి.రమేష్ బాబు అన్నారు. వరల్డ్ బైపోలార్ డే సందర్భంగా శనివారం విశ్వభారతి మెడికల్ కాలేజీలో అవగా హన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బైపోలార్ వ్యాధి ప్రతి 150 మందిలో ఒకరికి వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. మితిమీరిన ఆత్మవిశ్వాసం, ఆకలి, నిద్ర లేకపోవడం, పనిమీద ధ్యాస లేకపోవడం వంటి లక్షణాలుంటాయన్నారు. ఈ వ్యాధిని మందులతో నయం చేయవచ్చునని న్నారు. కార్యక్రమంలో విశ్వభారతి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మున్నీరుద్దీన్ అహ్మద్, మానసిక వ్యాధుల విభాగం హెచ్‌వోడీ శివశంకర్‌రెడ్డి, పీడీయాట్రిక్ సర్జన్ కృష్ణనాయక్, ఈఎన్‌టీ మహేంద్ర కుమార్, పీజీలు, వైద్యులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డిని ఓడిస్తాం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 30: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా మాదిగలంతా ఐక్యమై సార్వత్రిక ఎన్నికల్లో ఓడిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ గుండాల ఈశ్వరయ్య అన్నారు. శనివారం స్థానిక రాజ్‌విహార్ సెంటర్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఎస్సీ వర్గీకరణ నుంచి వ్యతిరేకంగా మాట్లాడడం, వర్గీకరణ జరగదని శాసనసభలో మాట్లాడారని అన్నారు. ప్రస్తుతం జరగాల్సిన ఎన్నికల్లో మాదిగలకు, మాలలకు సమానం గా ఇవ్వాల్సిన సీట్లల్లో ఎస్సీలకు 29 సీట్లకు గానూ మాలలకు 19 ఇచ్చి.. మాదిగలకు కేవలం 10 మాత్రమే ఇచ్చి అన్యాయం చేశారని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ వైసీపీకి వ్యతిరేకమై టీడీపీకి మద్దతు ఇచ్చారన్నారు. దీనిని జీర్ణించుకోలేని జగన్ రెడ్డి గుంటూరులో జరిగే కార్యవర్గ సమావేశానికి అనుమతి ఇవ్వకుండా మాదిగలను అవమానపరిచారన్నారు. ఈ సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు సుభాష్‌చంద్ర మాదిగ, బుడగ జంగం జాతీయ అధ్యక్షుడు తాటికొండ నారా యణ, ఆనంద్ మాదిగ, రెడ్డిపోగు విజయ్, కుమార్, మనోజ్, నూరి, బండారి గిడ్డయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్డిపోగు భాస్కర్

గూడూరు మండల టీడీపీ కన్వీనర్‌గా సురేష్



సురేష్, బొగ్గుల దస్తగిరిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(రూరల్), మార్చి 30: గూడూరు మండలం తెలుగు దేశం పార్టీ నూతన కన్వీనర్‌గా నాగలాపురం గ్రామానికి చెందిన జె.సురేష్‌ను నియమించినట్లు కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్త గిరి శనివారం తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఇదివరకు మండల కన్వీనర్‌గా కొనసాగుతున్న గూడూరు మండల మాజీ జడ్పీటీసీ జులకల్ సుధాకర్‌రెడ్డిని తొలగించి ఆయన స్థానంలో పార్టీ సౌలభ్యం కోసం సురేష్‌ను నియమించామన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థాయిలో అందరిని కలుపుకొని టీడీపీని బలోపేతం చేయాలని కోరారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతు టీడీపీని అధికారంలోకి తెచ్చేం దుకు కృషి చేస్తానన్నారు. గూడూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి బొగ్గుల దస్తగిరి, సురేష్‌ను శాలువకప్పి, పూలమాలతో సత్కరించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

ఓర్వకల్లు, మార్చి 30: మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ పి.ప్రసాదరావు శనివారం తెలిపారు. ఏపీఆర్‌ఈఐఎస్ సంస్థలో పాఠశాలలో 2024-2025 విద్యాసంవత్సరానికి 38 సాధారణ పాఠశాలలో 5, 6, 7, 8 తరగతుల్లో, అలాగే జూనియర్ ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఏప్రిల్ 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మైనార్టీ పాఠశాలలో చేరే విద్యార్థులు ఎంట్రెన్స్ పరీక్ష రాయాల్సిన అవసరం లేదన్నారు.


వెంకట తులసమ్మకు ఘనంగా వీడ్కోలు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 30: పదవీ విరమణ పొందిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 వెంకట తులసమ్మను ఘనంగా సన్మానించారు. శనివారం ఆసుపత్రిలోని ఓల్డ్ సీఎల్‌జీలో రిటైర్డు అవుతున్న ఆమెను నర్సింగ్ సూపరింటెండెంట్లు గ్రేడ్-2లు, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు సన్మానించారు. గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లు సావిత్రీబాయి, నాగమణి, క్యాన్సర్ హాస్పిటల్ గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లు అనసూయ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

4న ఈత కొలను పునఃప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 30: నగరంలోని కిసాన్ ఘాట్‌లోని డీఎస్‌ఏ ఈత కొలనును ఏప్రిల్ 4న పునఃప్రారంభిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు తెలిపారు. ఈత కొలనుకు చిన్న చిన్న మరమ్మతులు చేశామన్నారు. వేసవిలో విద్యార్థుల సౌకర్యం కోసం ఈత కొలన్ను ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 వరకు తెరిచి ఉంటుందన్నారు. ఈత కొలను సభ్యత్వం కోసం పిల్లలకు ఆరేళ్ల పూర్తయి ఉండాలని డీఎస్‌డీవో తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(రూరల్), మార్చి 30: కర్నూలు రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో శనివారం 52వ వార్డు ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమానికి సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వం కర్నూలు రూరల్ మండలం పి.రుద్రవరం శివారులో 20వేల మంది కర్నూలు నగర వాసులకు ఇంటి పట్టాలిచ్చారన్నారు. ఇంటి నిర్మాణ పనులు నేటికీ కూడా మొదలుపెట్టలే దని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ పనులు చేసి జీవనం కొనసాగిస్తూ ఇంటి అద్దెలు చెల్లించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పేదలకు ఇచ్చిన స్థలంలో ఇంటినిర్మాణ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శివకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నగర నాయకులు మహేష్, నాగరాజు, అన్వర్, సోమన్న, అమినాబీ, కుమార్, ఖాజా, రాజ, సులోచనమ్మ, రసూల్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

సి.బెళగల్, మార్చి 30: తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికులా పనిచేయాలని మాజీ ఎంపీపీ నాగమణి అన్నారు. శనివారం మం డల కేంద్రమైన సి.బెళగల్‌లో తమ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్ మోహన్‌రెడ్డికి రోజులు దగ్గర పడే కొద్ది టీడీపీ గెలుస్తుందనే భయంతో ఐదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడే గుర్తు వచ్చిందా? అని ఆమె ప్రశ్నించారు. కోడుమూరు నియోజవర్గంలో టీడీపీ గెలవడం ఖాయమని అన్నారు. ఈసమావేశంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ పాండు రంగన్నగౌడు, గిడ్డయ్యగౌడు, హనుమంతుగౌడు, రంగన్న, రాముడు పాల్గొన్నారు.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 30: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను బకాయిలపై ఇస్తున్న వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎ.భార్గవతేజ శనివారం తెలిపారు. ఈనెల మొదటి నుంచి సెలవు రోజుల్లో కూడా పన్ను వసూలు కేంద్రాలు పనిచేశాయన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, మార్చి 30: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో శకుంతల సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని 1, 2, 3, వార్డులలోని తాగునీటి పైపులైన్లను ఆమె పరిశీలించారు. ఎంపీడీవో శకుంతల మాట్లాడుతూ బ్యాధోళి, సి.బెళగల్, క్రిష్ణదొడ్డి, చింతమానుపల్లె, మారందొడ్డి గ్రామాలలో తాగునీటి సమస్య ఉందని ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. అనంతరం సి.బెళగల్‌లోని సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సీఎం చెప్పినవన్నీ అబద్ధాలే

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు
● మేము సిద్ధం సభా మైదానాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసిన టీడీపీ శ్రేణులు

ఎమ్మిగనూరు, మార్చి 30: సీఎం జగన్ ఎమ్మిగనూరు సభలో మాట్లాడిన మాటలన్ని అబద్ధాలేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. శనివారం ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి నాగరాజులతో కలిసి పట్టణంలో శుక్రవారం వైసీపీ నిర్వహించిన మేము సిద్ధం సభా మైదానాన్ని టీడీపీ శ్రేణులతో కలిసి పసుపునీళ్లు చల్లి శుద్ధి చేశారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ సీఎం జగన్ ఎమ్మిగనూరు సభలో రైతులు, మహిళలు, యువకులు, సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడాడని చెప్పినవన్ని పచ్చి అబద్ధాలేనని పేర్కొన్నారు. ఆరున్న ఏళ్లక్రితం ప్రజా సంకల్ప యాత్రలో జగన్ కర్నూలు జిల్లాకు వచ్చే సమయంలో జిల్లాలోని వేదావతి, గుండ్రేవుల, ఆర్డీఎస్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తానని చెప్పారన్నారు. సీఎంగా ఈ ఐదేళ్లు పూర్తయిన గుండ్రేవుల గురించి ఆలోచించలేదని, వేదవతి ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయని అన్నారు.

హెలిప్యాడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన నాయకులు: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎమ్మిగనూరుకు వస్తున్నారు. దీంతో పట్టణ శివారలోని ఆదోని రోడ్డులో హెలీక్యాప్టర్ దిగేందుకు స్థలాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పరిశీలించి పలు సూచనలు చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక : గోనెగండ్ల మండలం గంజళ్ల గ్రామాని కి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు బీవీ జయనాగేశ్వర రెడ్డి, బీటీ నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ మేరకు టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు బడేసాబ్ స్వామి, దేవదాసు, సూరిలతో పాటు మరి కొంత మందికి టీడీపీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు.



వీవర్స్ కాలనీ మైదానాన్ని పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేస్తున్న టీడీపీ నాయకులు

అందరి సహకారంతో విజయం సాధిస్తా

● ఆలూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్

ఆలూరు, మార్చి 30 : టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల సహకారంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరులో విజయం సాధిస్తానని ఆలూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆలూరులోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో ఆయనను కలిసేందుకు కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసే వరకు ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. అన్ని వర్గాల వారిని కలుపుకుపోయి ఆలూరులో టీడీపీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ యువ నాయకులు గిరిమల్లేష్ గౌడ్, నాయకులు నరసప్ప పాల్గొన్నారు.

హొళగుంద : స్థానిక సిద్ధేశ్వర రైస్‌మిల్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు ఈడిగ గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఎల్లర్తి శేక్షావలి, షాషావలి సాహెబ్‌ల దర్గా, హొళగుందలోని సిద్దేశ్వర స్వామి దేవాలయాన్ని, సాయిబాన్న తాత దర్గాను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

వడ్డీ మాఫీకు నేడు చివరి అవకాశం

ఆదోని టౌన్, మార్చి 30 : పట్టణ ప్రాంతాలలో పేరుకుపోయిన ఆస్తి పన్నుల బకాయిలపై ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీ అవకాశం ఆదివారంతో ముగియనుంది. చివరి రోజు కావడంతో బకాయిదారుల కోసం ఆదివారం కూడా కౌంటర్ తెరిచే ఉంటుందని, బకాయిదారులు వినియోగించుకోవాలని కమిషనర్ రామచంద్రా రెడ్డి తెలిపారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఉసేని

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 30: ఎమ్మిగనూరు పట్టణంలో ప్రతియేటా ఏప్రిల్ 14న నిర్వహించే అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీకి చైర్మన్‌గా మాల ఉసేని ఎంపికయ్యారు. శనివారం అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ దేవసహాయం అధ్యక్షతన జరిగన సమావేశంలో ఈ మేరకు ఎంపిక జరిగింది.

ఆర్‌సీసీ మద్దతు కోరిన పార్థసారధి

ఆదోని టౌన్, మార్చి 30 : ఆదోని బీజేపీ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ (ఆర్‌సీసీ) గౌరవ అధ్యక్షుడు, పారిశ్రామికవేత్త శ్రీకాంత్‌రెడ్డిని కలిసి మద్దతు కోరారు. ఎన్నికల్లో తనకు సహకరించి, విజయానికి తోడ్పాటునందించాలని కోరారు. అనంతరం పార్థసారథిని సన్మానించారు.

వైభవంగా సుయతీంద్రతీర్థుల మధ్యారాధన

మంత్రాలయం, మార్చి 30: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల 11వ మధ్యారాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బంగారు రథంపై సుయతీంద్రతీర్థుల చిత్రపటాన్ని ఊరేగించారు. మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, సీఆర్‌ఓ విజయీంద్ర ఆచార్, చక్రపాణి ఆచార్,లక్ష్మీశ్వర కృష్ణాచార్, సులాధి హనుమేష్ ఆచార్‌లకు ప్రశంస పత్రం, మెమెంటోతో సత్కరించారు.

ఓటును అమ్ముకోవద్దు

● తెలగ, బలిజ, కాపు జేఏసీ కన్వీనర్ దాసరి రాము

మద్దికెర, మార్చి 30: రాష్ట్రంలో అత్యధిక జనాభా గల తెలగ, బలిజ, కాపులు మన ఓటును అమ్ముకోకుండా ఒకేతాటిపై నడవాలని తెలగ, కాపు, బలిజ జేఏసీ దక్షిణ భారతదేశ కన్వీనర్ దాసరి రాము అన్నారు. శనివారం మద్దికెర గ్రామంలోని కాపు, బలిజ రాయలసీమ కన్వీనర్ వైపీ వీరన్న స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మన ఓటు నిజాయితీ నిబద్దత గల వారికి ఓటు వేయాలని కోరారు.

జనసేన నేత తల్లిదండ్రుల దుకాణం దహనం

పత్తికొండ, మార్చి 30 : జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజశేఖర్ తల్లిదండ్రులు జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న దుకాణాన్ని(బంకు) గుర్తుతెలియని దుండగులు శుక్రవారం రాత్రిపెట్రోల్ పోసి దహనం చేశారు. దుకాణంలో ఉన్న నగదుతోపాటు వస్తువులు కాలిబూడిదయ్యాయి. రాజకీయంగా తన ఎదుగుదల చూడలేక ఈ దారుణానికి ఒడిగట్టారని, సంఘటనపై రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదుచేశామన్నారు.

అండగా ఉంటా : కేఈ

మద్దికెర, మార్చి 30: టీ అధైర్యపడొద్దని, టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం మద్దికెర గ్రామంలో ఈ నెల 29న మద్దికెరలో రైతులు రవి, శ్రీనివాసులుకు చెందిన 30ట్రాక్టర్ల పశుగ్రాసం కాలిపోయి నష్టపోయిన విషయం తెలుసుకున్న కేఈ శ్యాంబాబు బాధితులను పరామర్శించారు. అనంతరం మండల టీడీపీ అధ్యక్షులు శివప్రసాద్ యాదవ్ స్వగృహంలో బాధితులతో కలిసి ధైర్యం చెప్పారు.

బీజేపీ నేత నీలకంఠ పై కేసు

ఆదోని, మార్చి 30 : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠతోపాటు మరికొందరిపై కేసు నమోదయింది. అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అనుపమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గోపినాథ్ తెలిపారు.

క్రైస్తవులు ఐక్యతతో ముందుకు సాగాలి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 30 : క్రైస్తవులంతా ఐక్యతతో ముందుకు సాగాలని ఆదోని క్రైస్తవ సంఘాల పాస్టర్లు రెవరెండ్ పాస్టర్ భాస్కర్ బాబు, బ్రదర్ బెనర్జీరాజు, విక్టర్ పాల్ ఫిలిప్, పాస్టర్ సుజిత్ విలియమ్స్, రవిప్రకాష్ అన్నారు. శనివారం క్రైస్తవులు క్రీస్తు పునరుద్ధాన దినాన్ని పురస్కరించుకొని ఆదోని, ఆలూరు పట్టణాలలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పరి బైపాస్‌లోని మహిమ ప్రార్థన మందిరం నుంచి సాగిన ర్యాలీకి క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. క్రైస్తవులంతా ప్రపంచ శాంతి కోసం, దేశ, రాష్ట్ర అధినేతల కోసం ప్రార్థించి ఆయన చూపిన దయా, కరుణ, ప్రేమను ప్రతి ఒక్కరికీ అందించాలని కోరారు. రన్ ఫర్ జీసస్ కన్వీనర్ జీజే సునీల్ రాజ్‌కుమార్, శాంత కుమార్, డేవిడ్, హోసన్న, పాస్టర్లు ఆశీర్వాదం, శాంతన్న, జకరయ్య, శరత్‌బాబు, బాలరాజు, జయపాల్, జాన్ పాల్గొన్నారు.

ఆలూరు : ఆలూరు పట్టణంలోని సీఎస్ఐ చర్చ్ అధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక చెక్‌పోస్ట్ నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా చర్చి వరకు క్రైస్తవులు ప్రదర్శన నిర్వహించారు. క్రైస్తవులపై దాడులు నియంత్రించాలని కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి దేవదానం, కోశాధికారి సుకుమార్, సభ్యులు రాజన్న, జాన్ పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్ : స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఐసీసీసీ పొలిటికల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు సందడి తిరుపాలు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. క్రైస్తవ సంఘం నాయకులు సాలు రంగడు, ఫాస్టర్ల సంఘం అధ్యక్షులు ముత్తురంగన్న, ఫాస్టర్లు నాగేశ్వరరావు, రాజు, డేనియల్, రాంబాబు, ఆనంద్, శాంతి పాల్గొన్నారు.



ఆలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

దుర్మార్గపు పాలనను అంతమొందిద్దాం

ఆదోని, మార్చి 30 : తేదేపా, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ పార్థసారథిని ఆదోనిలో గెలిపించుకొని దుర్మార్గపు పాలనను అంతమొందిద్దామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ, శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం అన్నారు. శనివారం కూటమి అభ్యర్థి పార్థసారథితో పాటు, టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి పంచలింగాల నాగరాజును వేరువేరుగా కలిసి పార్టీ గెలుపునకు సహకరించాలని కోరారు.